క్లుప్తంగా

డీఎస్సీ విజేతకు సన్మానం



లక్ష్మణరావును సత్కరిస్తున్న గ్రామస్తులు

జి.సిగడాం: మధుపాం గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికైన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందిన మామిడి లక్ష్మణరావును సర్పంచ్ బోగాది అప్పలనాయుడు, గ్రామస్తులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వివిధ శాఖల ఉద్యోగులు ఉన్నా ఉపాధ్యాయ ఉద్యోగం మాత్రం ఎవరికీ రాలేదని, ఆ లోటును భర్తీ చేస్తూ లక్ష్మణరావు ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

ముకుందరావుకు జాతీయ ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ముకుందరావు

ఎచ్చెర్ల : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం క్యాంపస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జాతీయ సేవా పథకం కో–ఆర్డినేటర్ పెద్దింటి ముకుందరావుకు ఎస్‌పీఎల్‌టీవో సంస్థ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారంతో సత్కరించింది. పదహారేళ్లుగా బోధనా వృత్తిలో ఉన్న తనను గుర్తించి ఈ పురస్కారం అందించడం ఆనందంగా ఉందని ముకుందరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, పీఆర్‌వో మామిడి షణ్ముఖరావు, సహోద్యోగులు ముకుందరావును అభినందించారు.

యువతకు పోలీసుల అభినందనలు



యువకులను అభినందిస్తున్న ఎస్‌ఐ

గార: సీసీ కెమెరాలు నేర నియంత్రణకు ఉపయోగపడతాయని, దేవాలయాలు వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ సీహెచ్.గంగరాజు అన్నారు. గురువారం బందరువానిపేటలో స్థానిక యువత సహకారంతో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా వాటిని పరిశీలించారు. నేర విచారణ సమయంలో సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు.

కొనసాగుతున్న యూరియా కష్టాలు



తండ్యాలపేటలో క్యూలైన్‌లో రైతులు

గార: యూరియా బస్తా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. గురువారం శ్రీకూర్మం పంచాయతీ తండ్యాలపేట సచివాలయానికి 110 బస్తాలు యూరియా రాగా వాటి కోసం రైతులు బారులు తీరారు. ఎక్కువ ఎకరాలు ఉన్నప్పటికీ ఆధార్, పాసుపుస్తకం ద్వారా ఒక బస్తా మాత్రమే అందజేశారు. టోకెన్ పద్ధతిలో సరఫరా చేయగా, వెనుక ఉన్న రైతులకు యూరియా దొరకలేదు. గార ఎస్‌ఐ గంగరాజు, పోలీసులు భద్రతల మధ్య అమ్మకాలు సాగాయి.

యూరియా అందని రైతులకు ప్రాధాన్యత

రణస్థలం : ఇంతవరకు యూరియా అందని రైతులను గుర్తించి పంపిణీలో ప్రాధాన్యమివ్వాలని శ్రీకాకుళం ఆర్డీఓ కె.సాయిప్రత్యూష సిబ్బందికి సూచించారు. జె.ఆర్.పురం రైతు సేవా కేంద్రం, ఆనందరావు(డీజీఎం) ఎరువుల దుకాణాన్ని గురువారం పరిశీలించారు. పురుగుల మందులు, గుళికలతో ముడిపెట్టకుండా యూరియా మాత్రమే రైతులకు ఇవ్వాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రభుత్వం రైతుల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా సమాచారం సేకరిస్తుందని, అందులో ఎటువంటి ఫిర్యాదు వచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఏవో డి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హెడ్ కానిస్టేబుల్ మృతి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏహెచ్‌టీయూ విభాగంలో మహిళా హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బి.రాములమ్మ గురువారం అనారోగ్యంతో చెన్నైలో మృతిచెందారు. ఈమె కొంతకాలంలో మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చీకటి నుంచి.. వెలుగులోకి..!



- స్ఫూర్తిగా నిలుస్తున్న నేత్రదానం
- జనాల్లో పెరుగుతున్న చైతన్యం
- 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్ :

సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. అంధుల జీవితాలలో వెలుగులు విరజిమ్మాలంటే నేత్రదానానికి మించినది మరొకటి లేదు అంటోంది నేటి ఆధునిక పరిజ్ఞానం. ఒకరి అవయవం మరొకరికి అమర్చడం వల్ల వారిలో వైకల్యాన్ని పోగొట్టే అవకాశం కలుగుతుంది. ఇలాంటి వాటిలో నేత్రదానం ఒకటి. మాజీ ప్రధాని మంత్రులు రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీలు 1986 ఆగస్టు 25న నేత్రదానానికి అంగీకారం తెలుపుతూ ఆదర్శంగా నిలిచారు. ఆనాటి నుంచి దేశమంతటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రెడ్‌క్రాస్‌లు కలిసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 2008లో ఏర్పాటు చేసిన నేత్ర సేకరణ కేంద్రం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు.



శ్రీకాకుళంలోని మగటపల్లి కళ్యాణ్ నేత్రసేకరణ కేంద్రం

నేత్ర సేకరణ అంటే..

నేత్రదానం అంటే మరణించిన వ్యక్తి కళ్లు తీసేస్తారనే భావం చాలామందిలో ఉంది. ఇది అపోహ మాత్రమే. మనిషి చనిపోయిన 6 నుంచి 8 గంటల్లో వ్యక్తి నేత్రాల్లో ఒక పొరను మాత్రమే సేకరిస్తారు. దాన్నే కార్నియా అంటారు. మిగిలిన కన్ను అలాగే ఉంటుంది. సాధారణ వ్యక్తులతో పాటు దృష్టిలోపంతో కళ్లద్దాలు ధరించేవారు, షుగరువ్యాధి, రక్తపోటు, గుండెపోటు, ఆస్తమా, క్షయ వ్యాధులు ఉన్నవారు, కాటరాక్టు ఆపరేషను చేయించుకున్నవారు, ప్రమాదంలో మరణించేవారు నేత్రదానం చేయవచ్చు. ఎయిడ్స్, హెపటైటిస్–బి(పచ్చకామెర్లు), ర్యాబిస్, పాముకాటు, బ్లడ్ కేన్సర్, సెప్టిసీమియా లాంటి వ్యాధులు ఉన్నవారి నేత్రాలు మాత్రం దానానికి పనికిరావు.

సేకరణ ఇలా..

- మనిషి మరణాంతరం ఆరు నుంచి ఎనిమిది గంటల్లోపు మాత్రమే నేత్రసేకరణ జరుగుతుంది.
- ఐ బ్యాంక్ ప్రతినిధులకు దాత కుటుంబ సభ్యులు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలి.
- మృతదేహం ఉన్న గదిలో ఫ్యాన్ ఆపివేయాలి. మూసి ఉంచిన కళ్లపై తడి రుమాలు ఉంచాలి. తలకింద రెండు ఎత్తుల తలగడలు ఉంచాలి.
- నేత్రసేకరణకు 15నుంచి 20 నిమిషాలు సరిపోతుంది.
- అంతిమ సంస్కారాలకు నేత్రసేకరణ వల్ల ఎటువంటి అంతరాయం, ఆటంకం కలగదు. కళ్లను పూర్తిగా తొలగించరు. కేవలం కార్నియా(నల్లగుడ్డు పొర) మాత్రమే సేకరించి, కృత్రిమ పొరను మృతుని కళ్లకు అమరుస్తారు.
- సేకరించిన కార్నియా పొరలను తుది పరీక్షల అనంతరం 72గంటల్లో ఇద్దరు కార్నియల్ అంధులకు అమర్చడం ద్వారా వారికి చూపు వస్తుంది.

1052 కార్నియాల సేకరణ

రెడ్‌క్రాస్ నేత్ర సేకరణ ద్వారా ఇప్పటికి 1052 కార్నియాలను సేకరించారు. వాటి ద్వారా 800 మందికి చూపుదక్కింది. ప్రజల్లో పెరుగుతున్న అవగాహన ఇందుకు కారణంగా చెప్పవచ్చు. ఇప్పటికి 4వేల మందికి పైగా నేత్రదానం కోసం ధ్రువపత్రాలను అందించారు.

నేత్రదానం చేయాలనుకుంటే..

జిల్లాలో ఎవరైనా నేత్రదానం చేయాలంటే రెండు సేకరణ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మగటపల్లి కళ్యాణ్ నేత్రసేకరణ కేంద్రం, మరొకటి ఆరోగ్యవరం కంటి ఆసుపత్రి, సోంపేటకు తెలియజేయాలి. వివరాలకు 7842699321 నంబర్‌ను సంప్రదించవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం..



నేత్రదానం ప్రతి కుటుంబానికి సంప్రదాయం కావాలి. ఇప్పటికే గ్రామాల్లో పారామెడికల్ ఆప్తాలమిక్ అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. సమావేశాలు, ర్యాలీలు, విద్యార్థులకు పోటీలు పెడుతున్నాం. నేత్ర సంబంధిత వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. కార్నియల్ అంధత్వం నివారణకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్ ఎస్.పుష్పలత, జిల్లా ప్రోగ్రాం మేనేజర్, అంధత్వ నివారణ సంస్థ, శ్రీకాకుళం

నేత్రసేకరణకు ప్రత్యేక శ్రద్ధ..



నేత్ర సేకరణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. దాత కుటుంబ సభ్యుల నుంచి ఫోన్ రాగానే వెంటనే స్పందించి మా టెక్నీషియన్‌ను అక్కడికి పంపిస్తున్నాం. సేకరణలో ఆధునిక పద్ధతులు పాటిస్తున్నాం. కార్నియాలు అమర్చిన వారు చక్కగా చూడగలుగుతున్నారు.

– పి.జగన్మోహనరావు, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్

కళ్లను కాపాడుకోవాలి..



చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు తమ కళ్లను నేత్ర వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలి. చిన్నారులు ఎక్కువగా మొబైల్‌ఫోన్ చూడడం వల్ల కళ్లు పాడిబారుతున్నాయి. కంటిలో రేడియేషన్ వల్ల రెటీనాలో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

– ఎం.ఆర్.కె.దాస్, పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్

గురువులను గౌరవిద్దాం



శ్రీకాకుళం అర్బన్: గురువులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులు



ఎచ్చెర్ల : అంబేద్కర్ వర్సిటీలో వీసీ కె.ఆర్.రజనీని సన్మానిస్తున్న దృశ్యం



జి సిగడాం: ఆదర్శ పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



శ్రీకాకుళం రూరల్: ఇప్పిలి హైస్కూల్లో హెచ్‌ఎం మణిపాత్రుని నాగేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విశిష్టమైనదని, గురువులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. గురుపూజోత్సవం పురస్కరించుకుని గురువారం పలు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. బోధనలో విశేష సేవలందించిన గురువులను పలు కార్యాలయాల్లో సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ శిక్షణా సదస్సు గురువారంతో ముగిసింది. కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో రోయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ(యూకె), లోకల్ సెక్షన్ ఇండియా సహకారంతో టీఎల్‌సీ, కోలన్ క్రొమొటోగ్రఫీ సెపరేషన్ అండ్ స్పెక్ట్రో స్కోపిక్ టెక్నిక్స్ అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో పలువురు నిష్ణాతులు, శాస్త్రవేత్తలు పాల్గొని విశ్లేషణాత్మక ఉపన్యాసాలను అందించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి సదస్సులు విద్యార్థులకు, అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.శ్యాంబాబు హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డి.ఆదినారాయణ, కో–ఆర్డినేటర్ డా.ఎస్.రామకృష్ణ, డా.వై.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు ఆర్.ప్రకాశరావు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్‌కు నూతన కమిటీని గురువారం పరిచయం చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఆర్.ప్రకాశరావు, అధ్యక్షుడు ఏ.గణేష్, ఉపాధ్యక్షులు ఎస్.పార్వతి, డి.చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి ఎంబలరాం పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



జామి వెంకటేశ్వరి



కోట తిరుపతిరావు



తూముల జగదీశ్వరరావు



చిట్టి త్రినాథరావు



కోడూరు సురేష్‌కుమార్

రణస్థలం: ఎస్.బంటుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని జామి వెంకటేశ్వరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. నిబద్ధత, సృజనాత్మకతతో పాఠాలను బోధిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. ఈమెను తోటి ఉపాధ్యాయులు అభినందించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటారు.

జి.సిగడాం: స్థానిక మోడల్ పాఠశాల్ తెలుగు అధ్యాపకులు కోట తిరుపతిరావు, తూముల జగదీశ్వరరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

గార: శ్రీకూర్మం పొందరవీధి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చిట్టి త్రినాథరావు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈయన యోగా, ధ్యానం, డ్రాప్ ఔట్ విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించడం, స్కౌట్స్, గైడ్స్ లో శిక్షణ ఇవ్వటంతో పాటు జిల్లా రిసోర్సు పర్సన్‌గా విద్యారంగంలో సేవలందిస్తున్నారు. గార మోడల్ ప్రైమరీ స్కూల్ ఎస్‌జీటీ కోడూరు సురేష్‌కుమార్ కూడా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. ఈయన విద్యా బోధనతో పాటు స్వచ్ఛంద సంస్థ ద్వారా కేన్సర్ రోగులకు సాయమందించడంలో తన వంతుగా కృషిచేయడం, మండల రిసోర్సు పర్సన్‌గా సేవలందిస్తున్నారు.

కోర్టు ఆవరణలో ఈ–సేవా కేంద్రాలు



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ–సేవా కేంద్రాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేసుల స్థితి, ఫైలింగ్ సేవలను ఈ–సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీతరాజు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, కార్యదర్శి కొమ్ము రమణమూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం



కోదండరామాలయంలో ట్రస్టుబోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు దేవాలయాలకు ప్రభుత్వం నియమించిన ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం నిర్వహించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.ఆర్.వి.వి.ప్రసాద్ పట్నాయక్ పర్యవేక్షణలో ప్రమాణ స్వీకార మహోత్సవాలు జరిగాయి. ప్రతిష్టాత్మక కోదండ రామాలయం ట్రస్టు బోర్డు చైర్మన్ ఎన్నిక మాత్రం జరగలేదు. దరఖాస్తులు లేకుండానే ముందుగా ఎమ్మెల్యే జాబితా మంజూరు చెయించారు. అనంతరం దేవదాయ అధికారులు సంబంధిత సభ్యుల నుంచి దరఖాస్తులు సేకరించారు. ఈ క్రమంలో నడగాన విజయ పేరు ముందుగా జాబితాలో ఉన్నా దరఖాస్తుకు ఆమె నిరాకరించడంతో చైర్మన్ ఎన్నిక జరగలేదు. పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం ట్రస్టు బోర్డు సభ్యులుగా బరాటం ఈశ్వరరావు, ఆనెం మీనాకుమారి, గొర్లె బాలకృష్ణ, సనపల ముకుందరావు, వైద లలితాదేవి, ఎంఏవిటి చక్రవర్తి, దుంప విశ్వక్రాంతిలు ప్రమాణ స్వీకారం చేశారు. అద్దమణుగుల వెంకన్నపంతులు సత్రానికి చైర్మన్‌గా కెల్ల కిషోర్‌కుమార్, సభ్యులుగా ఎల్.రమణమ్మ, పి.పూర్ణిమ, ఇంటి శంకరరావు, పి.రమణమూర్తి, సిహెచ్ మీనాక్షి, డి.రాంబాబు, యు.రాజేశ్వరి ప్రమాణ స్వీకారం చేశారు. చిన్న బజారులోని దూదివారి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్‌గా సాన హరిత, సభ్యులుగా సుసరాపు లక్ష్మీగణపతి శర్మ, సతివాడ ధర్మారావు, ఎం.లక్ష్మీ, పి.లక్ష్మీ, కె.గంగాధర్, కె.శశిభూషణ్‌రావు, కోరాడ పద్మావతి ప్రమాణ స్వీకారం చేశారు. కొన్నావీధి భీమేశ్వరాలయం ట్రస్టు బోర్డు చైర్మన్‌గా వంగ మహేష్, సభ్యులుగా సీహెచ్ రాజులు, వి.ఉమాదేవి, పి.సంజీవరావు, ఎ.అసిరమ్మ, ఎస్.మధుసూదనరావు, కె.సతీష్‌రెడ్డి, టి.వేంకటేష్ శర్మలు ప్రమాణ స్వీకారం చేశారు. తుమ్మావీధిలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ట్రస్టు బోర్డు చైర్మన్‌గా ముక్కాల కొండబాబు, సభ్యులుగా కోరాడ తేజేశ్వరి, జి.చంద్రమౌళి, ఎ.లత, కె.శంకరరావు, జి.వెంకట లావణ్య కుమారి, జి.ప్రసాదరావులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఈవోలు సర్వేశ్వరరావు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

14న జిల్లా స్థాయి పాటల పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 14న జిల్లా స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు యువ రచయితల వేదిక అధ్యక్షుడు తంగి యర్రమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. దేశభక్తి గీతాలు, తెలుగు భాషకి సంబంధించిన పాటలు మాత్రమే ఆలపించాలని కోరారు. ఆసక్తి గల వారు ఈ నెల 13లోగా 9866524822 నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

గ్రావెల్ వాహనాలు పట్టివేత

రణస్థలం: జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలస కొండ వద్ద అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నట్లు తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. కొండములగాం గ్రామానికి చెందిన కలిశెట్టి దాలినాయుడుకు ఎటువంటి అనుమతులు లేనందున గ్రావెల్‌తో పాటు జేసీబీ, ట్రాక్టర్ పట్టుకుని అపరాధ రుసుం విధిస్తున్నట్లు చెప్పారు.

నేడు ముస్లింల శాంతి ర్యాలీ

శ్రీకాకుళం కల్చరల్: శాంతిదూత ప్రవక్త మహ్మద్ 1500వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ముస్లింల ఐక్యవేదిక ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. జామియా మసీదు వద్ద ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని, ముస్లింలంతా పాల్గొనాలని కోరారు.


ఎచ్చెర్ల ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పద్మ

రణస్థలం: ఎచ్చెర్ల ఏఎంసీ చైర్‌పర్సన్‌గా లావేరు మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకురాలు నిడిగంట్ల పద్మను నియమితులయ్యారు. ఈమె భర్త నిడిగంట్ల త్రినాథరావు లావేరు మాజీ జెడ్పీటీసీగా పని చేశారు.

6న డయల్ యువర్ డీఎం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణికుల సమస్యలు, వినతులు, సూచనల స్వీకరణకు ఈనెల 6న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం ఆర్టీసీ 2వ డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ గురువారం తెలిపారు. రెండో డిపో పరిధిలోని పాతపట్నం, సారవకోట, జలుమూరు, కొత్తూరు, హిరమండలం, లక్ష్మీనర్సుపేట, ఆమదాలవలస మండలాలకు సంబంధించి సమస్యలను ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 99592 25609 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

డీఈఓను తక్షణం నియమించాలి



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

శ్రీకాకుళం: జిల్లా విద్యాశాఖాధికారిని తక్షణం నియమించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. శ్రీకాకుళం ఎన్జీవో హోమ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ డీఈఓ పోస్టు ఖాళీ అయి నెలరోజులు గడిచినా భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. పూర్వపు డీఈఓ తిరుమల చైతన్యపై విచారణ చేపట్టారని, తీసుకున్న చర్యలపై అధికారులు గోప్యత విడనాడాలన్నారు. వైభవంగా చేపట్టాల్సిన గురుపూజోత్సవంలో డీఈఓ లేని లోటు స్పష్టంగా కనిపించిందన్నారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు మజ్జి మదన్మోహన్, బమ్మిడి శ్రీరామ్మూర్తి, తంగి మురళి, దుప్పల శివరామ్ ప్రసాద్, సీర రమేష్ బాబు, చింతాడ దిలీప్, పూజారి హరిప్రసన్న, బోనెల రమేష్, నూకరాజు కింజరాపు, వడమ శరత్, కోలక కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.